క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ సంబరాలు


వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకయ్యపేటలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎస్.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయిన సూరమ్మ నివాసంలో జరిగిన ఈ వేడుకల్లో బేతస్థ ఫిజియోథెరపిస్టు డాక్టర్ బగ్గం శ్రీనివాస్‌పట్నాయిక్ క్రీస్తు సందేశం వినిపించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

తెలుగు మహాసభలకు జంధ్యాల


జంధ్యాల శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందినట్లు శ్రీకాకుళం నగరానికి చెందిన కవి, రచయిత జంధ్యాల శరత్‌బాబు తెలిపారు. విజయవాడలో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు జరిగే 6వ తెలుగు మహాసభలకు వక్తగా ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. తొలి రోజున జరిగే 'పత్రికలు, ప్రచురణలు, ప్రసార రంగాల' సదస్సులో ప్రసంగిస్తానని తెలిపారు.

కవితల పోటీల్లో ప్రతిభ


కోవెలకొండ సంతోష్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలసకు చెందిన కోవెలకొండ సంతోష్‌కుమార్ కవితల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో సంతోష్‌కుమార్ రాసిన 'పుడమి తల్లి' కవితకు ద్వితీయ స్థానం లభించడంతో ప్రశంసాపత్రం అందజేశారు. ఈయన వీరఘట్టం మండలం చిదిమి పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సంతోష్‌కుమార్‌ను ఏపీ మోడల్ స్కూల్ తెలుగు పండిట్ కోట తిరుపతిరావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న గాయిత్రి

జి.సిగడాం: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కొత్తపల్లి గాయిత్రి అన్నారు. గురువారం పెంట రెవెన్యూ గ్రామంలో సర్పంచ్ పున్నాన సోనియా అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సబ్ డివిజన్‌లో ఎవరైనా తగాదాలు పడి కోర్టులను ఆశ్రయిస్తే వారి భూమికి మాత్రమే వన్-బి రాకుండా చేయాలి తప్ప ఇతర భూములకు కూడా వన్-బి రాకుండా చేయడం తగదన్నారు. తక్షణమే తమకు వన్-బి పత్రాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రాధ, సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు, పావని, వీఆర్ఓ భూపతి నర్సింగరావు , ఎంపీటీసీ మక్క శ్రీనివాసరావు, నాయకులు మక్క నారాయణరావు, పున్నాన అక్కలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో న్యాయవాదులకు ప్రత్యేక స్థానం


మాట్లాడుతున్న రెక్టార్ అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: సమాజంలో న్యాయవాదులకు ప్రత్యేక స్థానం ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. వర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాల ఎల్ఎల్‌బీ మొదటి ఏడాది విద్యార్థుల ఫ్రెషర్స్‌డే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తికి నిరంతరం డిమాండ్ ఉంటుందన్నారు. ఇంగ్లిష్‌పై పట్టు, సబ్జెక్టు, విషయ పరిజ్ఞానాలు పెంచుకోవాలని సూచించారు. ఉన్నత న్యాయస్థానాల తీర్పులు, మారుతున్న చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుజాత, ప్రిన్సిపాల్ అనురాధ, ఎల్ఎల్‌బీ కో-ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, బోధకులు సుజాత, జయలక్ష్మి, బాలకృష్ణ, మన్మథరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు.. శాశ్వత ఫలసాయం

- ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులు
- నీటి కుంటలు, కందకాల తవ్వకానికి ప్రాధాన్యం
- ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వం


కోష్ట పంచాయతీలో కొబ్బరిచెట్ల చుట్టూ కందకాలు తవ్వుతున్న ఉపాధి వేతనదారులు


కొచ్చెర్ల పంచాయతీలో కొబ్బరి మొక్కలు పెంచుతున్న దృశ్యం

రణస్థలం: రైతులకు శాశ్వత ఫలసాయం దక్కేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త పనులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఈ పనులకు మంచి ఆదరణ ఉండగా రెండు నెలల కిందట నిర్వహించిన గ్రామసభల ద్వారా మరికొన్ని పనులకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. పచ్చదనమే ప్రధానంగా న్యూస్ట్రాటజీ పేరిట టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. గ్రామాల్లో ఇప్పటికే పనుల అంచనాలు రూపొందించారు. అటు రైతులు, ఇటు వేతనదారులకు దీర్ఘకాలికంగా లబ్ధి చేకూర్చడం, అన్ని ప్రాంతాల్లో పచ్చదనం, పండ్లతోటల ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించడమే ధ్యేయంగా ఈ పనులు చేపట్టారు.

చెట్టు పెంపకంతో ఆదాయం..

పొలాల గట్లపై మొక్కల పెంపకం, చెట్ల చుట్టూ కందకాల(ట్రెంచ్‌లు) తవ్వించడం వంటి పనులకు ఉపాధి పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు. ఒక్కోచోట ఈ పనుల ద్వారా రైతులకు ఆటు పొలాల వద్ద చెట్లను సంరంక్షించుకునే అవకాశంతో పాటు రూ.17వేల వరకు వేతనం లభిస్తుంది. మరో వైపు. ఈ కందకాలతో చెట్టుకు నీటి సదుపాయం కలుగుతుంది. మూడెకరాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో నీటికుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్లు వెడల్పు, 9మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు తప్పనిసరిగా తవ్వాలి. వీటికి రూ.50వేలు వరకు అందజేస్తారు. ఇప్పటి వరకు రణస్థలం మండలంలో 200 ఎకరాల్లో సుమారు 140 మంది రైతులు కొబ్బరి మొక్కలు నాటారు.

తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు..

న్యూస్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్ల తోటల పెంపకం చేపడితే ఉపాధి పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తారు. హార్టికల్చర్ ద్వారా 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇస్తారు. వీటిని మూడేళ్లపాటు పెంపకానికి రూ.97వేలు వరకు ఉపాధి పథకం ద్వారా అందిస్తారు. మూడేళ్ల అనంతరం ఫలసాయాన్ని రైతులే పొందవచ్చు.

మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం

ఎన్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా కొబ్బరిమొక్కల పెంపకానికి ఉపాధి హామీ వేతనదారులతో కందకాలు తవ్వించడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మొక్కల ఎదుగుదలకు మూడేళ్ల పాటు సంరక్షణ కల్పిస్తూ ప్రోత్సాహకాలు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– చుక్క లక్ష్మణరెడ్డి
కొచ్చెర్ల పంచాయతీ

రైతులకు ఉపయోగకరం



రైతులు, వేతనదారులకు ఈ పథకం చాలా మంచిది. న్యూస్ట్రాటజీ పనుల్లో భాగంగా పండ్లతోటలు, కొబ్బరి మొక్కల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నాం. కందకాల తవ్వకానికి నిధులు కేటాయిస్తున్నాం. రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలి.

– ఎం.శ్రీనివాసనాయుడు
ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, రణస్థలం

నిలిచిన లారీలు



ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ సముదాయంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ముందు భారీగా లారీలు నిలిచిపోయాయి. గోదాం సామర్థ్యం తగ్గువగా ఉండటంతో మద్యం లారీల అన్‌లోడింగ్ జరగడం లేదు. దీంతో మండల పరిషత్ నుంచి పాత జాతీయ రహదారికి వెళ్లే వరకు బారులు తీరాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

మురపాకలో మేలుకొలుపు



లావేరు మండలం మురపాక గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా భక్తులు మేలుకొలుపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వేకువజామున గ్రామ వీధుల్లో భజనలు చేసుకుంటూ దేవుడి కీర్తనలు ఆలపిస్తూ గ్రామస్తులను మేలుకొలుపుతున్నారు.

– ఎచ్చెర్ల

సాయినాథుడికి అలంకరణ



నగరంలోని ఇలిసిపురం, ద్వారకానగర్‌లోని షిరిడీసాయి సంస్థాన్‌లో సాయినాథుడికి గురువారం అభిషేకాలు నిర్వహించారు. ఉదయం కాకడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగాయి. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

– శ్రీకాకుళం కల్చరల్

అరసవల్లి ఆలయ భూమి ఆక్రమణకు యత్నం!


ఆలయ భూమి బోర్డు వద్ద మట్టి పోగులు వేసిన దృశ్యం


ఆలయ భూమికి అడ్డంగా నిర్మించిన కల్వర్టు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యదేవాలయం భూములపై అక్రమార్కుల కన్నుపడింది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూములు సుమారు 95 ఎకరాలకు పైగా వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో అత్యధిక భాగం భూములు అర్చకుల పోషణకై వారి ఆధీనంలో ఉండగా.. మిగిలిన పలు భూముల్లో కౌలు రైతులు పంటలు పండిస్తున్నారు. వాడాడ కూడలిలో 84 సెంట్ల ఆలయ భూమిలో తూర్పులో కొంతభాగాన్ని కొందరు లేఅవుట్ వ్యాపారులు తమ రోడ్డు నిర్మాణం కోసం ఆక్రమణకు దిగారు. ఇప్పటికే మట్టి పోగులు వేయించి చదును చేయిస్తున్నారు. ఇదే భూమికి ఆవల వైపున భూముల్లో ప్లాట్ల వ్యాపారాలు జరుగుతున్న క్రమంలో ప్రధాన రహదారికి అనుసంధానమయ్యేందుకు ఈ ఆలయ భూమి మీదుగానే రోడ్డు వేస్తున్నారు. దీంతో తమ వ్యాపారాలకు అడ్డు లేకుండా నిర్మాణ పనులు శరవేగంగా జరిపేలా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సన్నద్ధమయ్యారు. ఇదే ఆలయానికి చెందిన పలు భూములపై రియల్ వ్యాపారుల కన్ను పడటంతో ఆలయ భూముల రక్షణ సాధ్యమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆక్రమణలపై ఆలయ అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ ఇంతవరకు చర్యలు చేపట్టకపోడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి

పోలీసులకు ఫిర్యాదు చేశాం..

వాడాడ కూడలిలో అరసవల్లి ఆలయానికి చెందిన భూముల్లో కొంత భాగంలో రహదారి నిర్మాణం విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఆలయ భూముల పరిరక్షణలో భాగంగా నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వై.భద్రాజీ, ఆలయ ఈవో, అరసవల్లి

కొబ్బరిచెట్ల ఫలసాయంపై వేలం నేడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జి.టి.రోడ్డులో ఉన్న జామియా మసీదులో కొబ్బరి చెట్ల ఫలసాయం పొందేందుకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు మసీదు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 450 కొబ్బరి చెట్లు ఫలసాయం ఏడాది పాటు పొందేందుకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఫరీదుపేట, కుశాలపురం, లింగాలపేట, ఎస్ఎంపురం, కేశవరావుపేట గ్రామాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రాస్‌కంట్రీ పోరుకు వేళాయె..


పరుగు సాధనలో అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు–లాంగ్‌రన్) పోరుకు రంగం సిద్ధమైంది. జిల్లా క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్టు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు), అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొన్న మధుసూదనరావు, మెంటాడ సాంబమూర్తి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాల మైదానంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి పోటీలు మొదలవుతాయని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను ఈ నెలాఖరున జరిగే ఏపీ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని చెప్పారు. అండర్-20 విభాగంలో బాలురు 8కేఎం, బాలికలు 6కేఎం పరుగుపోటీ, అండర్-18 విభాగంలో బాలురు 6 కేఎం, బాలికలు 4కేఎం పరుగు పోటీ, అండర్-16 విభాగంలో బాలురుకు 2 కేఎం, బాలికలకు 2 కేఎం పరుగు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలబాలికలు టెన్త్ మార్క్స్ మెమో, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 2పాస్ ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్‌తో ఉదయం 8 గంటలకు ఎంపికలు జరిగే ఆర్ట్స్ కళాశాల మైదానం వద్దకు చేరుకోవాలని సూచించారు. వివరాలకు 8500271575 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలో బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా ఊరేగింపు అనంతరం విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించారు. షిర్డీ తరహాలో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని పెంట మాజీ ఎంపీటీసీ మీసాల శ్రీనివాసరావు తల్లి అప్పలనారాయణమ్మ గురువారం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీనివాసరావు, నాయకులు పున్నాన అక్కలనాయుడు, పిల్లల శివకుమార్, డోల వెంకటరమణ పాల్గొన్నారు.

రణస్థలం: దేరసాం సర్పంచ్ మీసాల రామారావు తల్లి అచ్చెమ్మ గురువారం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం కూడా పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, నాయకులు చినరామినాయుడు, పిన్నింటి లక్ష్మునాయుడు, కంబపు నర్సింహరెడ్డి, మహంతి సత్యనారాయణ, మంత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శ్రీకాకుళం అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచం వ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుతున్నది అంబేడ్కర్ వల్లే అనే వాస్తవాన్ని మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.అప్పారావు, ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.హరీష్, డి.చందు, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, శ్రీకాకుళం పట్టణ పౌర సంక్షేమ వేదిక కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు బాధాకరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉంటూ అంబేడ్కర్‌పై వ్యాఖ్యానించడం తగదన్నారు. ఎన్నో దేశాలు వారి రాజ్యాంగాన్నీ క్రమశిక్షణతో అమలు చేయలేక అనేకమార్లు మార్చుకుంటున్న తరుణంలో.. నేటికి 75 ఏళ్లుగా ఒకే రాజ్యాంగాన్ని కొనసాగించడం అంబేడ్కర్ ఘనత కాదా అని ప్రశ్నించారు.

శిక్షణకు గైర్హాజరుపై ఎంపీడీఓ ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజ

శ్రీకాకుళం రూరల్ : శిక్షణా తరగతులకు పలువురు అగ్రికల్చర్ అసిస్టెంట్లు గైర్హాజరు కావడంపై శ్రీకాకుళం ఎంపీడీఓ బి.శైలజ మండిపడ్డారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఎన్ఎంలు, వెటర్నరీ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గైర్హాజరైన వారి వివరాలు కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ నెల 28వ తేదీలోగా ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయాలన్నారు. 19, 20 తేదీల్లో రాగోలు, సింగుపురం, ఒప్పంగి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కనుగులవానిపేట, లంకాం గ్రామాల్లో తర్వాత నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఈవో పీఆర్‌డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్న సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుడా మేలుకో..


బుడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఉమెన్స్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ఎచ్చెర్ల: వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా బుడుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ర్యాలీ నిర్వహించారు. వినియోగదారుడా మేలుకో.. అన్యాయాలను అరికడదాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వినియోగదారుల క్లబ్ కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు మాట్లాడుతూ మోసపూరిత ప్రకటనలు, ఆన్‌లైన్ మోసాలను వివరించారు. ఓటీపీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్లు 1915, 1800114000కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌కె ప్రసాద్, ఉపాధ్యాయులు ఎం.అనురాధ, పడాల తమ్మినాయుడు, కె.వెంకటరావు, శీలా రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్, ఎకనామిక్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల కొనసాగుతున్నాయి. గురువారం 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో జరిగే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అధ్యాపకులు లబ్బ కృష్ణారావు, డి.ప్రభాకరరావు, ఆదిలక్ష్మి, ఎస్.పద్మావతి, సీహెచ్ కృష్ణారావు, శ్రీరామ్మూర్తి, లలితాభాయి, సంతోషి, పావని పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి


శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: క్షేత్రస్థాయిలో స్వయం సహాయ సంఘాలు బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వ లక్షణాలు అనే అంశంపై ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి వెలుగు ఏసీ, ఏపీఎం, ఎల్‌సీ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. రాష్ట్ర పేదరిక నిర్మూలనసంస్థ, గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయ సంఘాలు బలోపేతమైతేనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని చెప్పారు. రుణాల మంజూరు, వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. ప్రస్తుతం సంఘాల నిర్వహణ మెరుగ్గా ఉందని, సంస్థాగతంగా బలోపేతం కావాలంటే ప్రభుత్వ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మహిళలు వ్యాపారాలు, చిన్న చిన్న పారిశ్రామిక యూనిట్లు ప్రారంభించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు రామ్మూర్తి, రాజారావు, అధికారులు మోహన్‌రావు, భాగ్యశ్రీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.